క్లుప్తంగా

ఎంపీ మిథున్ రెడ్డి విడుదల కోసం గిరి ప్రదక్షిణ


తిరువణ్ణామలైలో గిరి ప్రదక్షిణ చేస్తున్న రాజేష్

పుంగనూరు: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేసింది. దీనిపై వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకుడు రాజేష్ ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం తమిళనాడులోని తిరువణ్ణామలైలో శ్రీ అరుణాచలేశ్వరస్వామికి 14 కిలోమీటర్లు గిరి ప్రదక్షిణం చేసి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. రిమాండ్‌లో ఉన్న మిథున్‌రెడ్డి త్వరగా విడుదల కావాలని ప్రార్థనలు చేశారు.

క్రికెట్ సంయుక్త విజేతలుగా పలమనేరు, శాంతిపురం


విజేత జట్లతో నిర్వాహకులు

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏపీ గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులుగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం జరిగిన ఫైనల్ పోటీల్లో పలమనేరు, శాంతిపురం జట్లు సంయుక్త విజేతలుగా నిలిచాయి. గెలుపొందిన జట్లకు నిర్వాహకులు ట్రోఫీ, ప్రైజ్ మనీ అందజేశారు. మూడేళ్లుగా వీరి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళీనాథ్, స్థానిక క్రికెట్ సంఘ అధ్యక్షులు రంజింత్‌షా, న్యాయ నిర్ణేతలు సుబ్రమణ్యం, రామరాజ్, జఫ్రుల్లా, సాయి బంగారు, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ పోటీలు


పోటీలకు హాజరైన విద్యార్థులు

పుంగనూరు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం లీనార్డ్ హైస్కూల్‌లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు స్వాతంత్ర్యం రోజున బహుమతులు పంపిణీ చేస్తామని వారాహి గ్రూప్ సంస్థల ప్రతినిధి హేమంత్‌రాయల్ తెలిపారు.

విశ్రాంత విద్యుత్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎంపిక


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

పుంగనూరు: పుంగనూరు డివిజన్‌లోని విశ్రాంత విద్యుత్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృష్ణమూర్తి, కార్యదర్శిగా సురేష్‌బాబు, కోశాధికారిగా మునిరత్నం, గౌరవ అధ్యక్షులుగా చెంగయ్య, వీరయ్య, ఉపాధ్యక్షులుగా షంషీర్, నూర్జాహాన్ బేగం, సహాయ కార్యదర్శులుగా మల్లికార్జున, శంకర్ నాయక్ ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తామని తెలిపారు.

డిగ్రీ కళాశాలలో నూతన కోర్సులు

పుంగనూరు: పట్టణ సమీపంలోని ఎన్ఎస్.పేటలో వున్న శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన కోర్సులు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్ సైన్సు, బీఏ ఆనర్స్, పొలిటికల్ సైన్సు, బీకాం ఆనర్స్ కంప్యూటర్ అప్లికేషన్స్, జనరల్, బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్సు, బీఎస్సీ ఆనర్స్ మ్యాథమెటిక్స్ కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

చౌడేపల్లె: పుంగనూరు–బోయకొండ రోడ్డులోని అన్నిపల్లె సమీపంలో ఆదివారం రాత్రి బైక్‌ను కారు ఢీకొంది. ఆర్ఎంపీ మోహన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. చౌడేపల్లె మండలం వెంగళపల్లె పంచాయతీ గూబలవారిపల్లెకు చెందిన మోహన్ పుంగనూరులో ఆర్ఎంపీగా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి బైక్‌లో స్వగ్రామం వెళుతుండగా అన్నిపల్లె సమీపంలో కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన మోహన్‌ను స్థానికులు మదనపల్లెలోని ఒక ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. హొసూరుకు చెందిన భక్తులు కారులో బోయకొండ గంగమ్మను దర్శించుకుని తిరిగి వెళుతుండగా కారు బైక్‌ను ఢీకొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గతంలో సాగైన సజ్జ, రాగి, కంది పంటలు (ఫైల్)





పత్తాలేని చిరుధాన్యాలు!

- జిల్లాలో కనిపించని చిరుధాన్యాల సాగు
- సాగుపై కొరవడిన అధికారుల ప్రోత్సాహం
- భవిష్యత్తులో గింజలకు తప్పని ఇబ్బందులు

పలమనేరు: అసలు పంట ఆదుకోకున్నా కొసరు పంట ఆదుకుంటుందని పెద్దల సామెత. ఏటా ఖరీఫ్‌లో వేరుశనగతోపాటు సాలు పంటలను వేయడం ఆనవాయితీగా వచ్చేది. ఈ దఫా అదునులో వర్షాలు పడక జూన్, జూలైలో వేరుశనగ విత్తనాలు విత్తలేదు. తద్వారా సాలు పంటలైన కందులు, జొన్నలు, అలసంద, పెసలు, అనప తదితర పంటలు జాడ లేకుండా పోయింది. దీంతోపాటు చిరుధాన్యాలైన జొన్న, సజ్జ, కొర్ర, రాగి లాంటి పంటలు సైతం కనుమరుగయ్యాయి. గతంలో రైతుల చిరుధాన్యాలను బాగా పండించేవారు. ప్రతి ఇంట్లోనూ ఏడాదంతా చిరుధాన్యాలు ఉండేవి. అప్పట్లో చిరుధాన్యాల కూరలు ఘుమఘుమలాడేవి. వాటిలో పోషకాలు ఎక్కువగా వుండేవి. ప్రజలు ఆరోగ్యంగా వుండి ఎంత కష్టమైనా చేసేవారు. పదేళ్లుగా చిరుధాన్యాల సాగు చేయడం లేదు. నాడు వేలాది ఎకరాల్లో చిరుధాన్యాల సాగు ఉండగా.. నేడు సాగు బాగా తగ్గిపోయి కొన్ని ప్రాంతాల్లో కొన్ని ఎకరాల్లో మాత్రమే చేపడుతున్నారు. వీటి సాగుపై అధికారులు అవగాహన కల్పించలేదు. ప్రభుత్వం కూడా ప్రోత్సహించడం లేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో చిరుధాన్యాల గింజలు కూడా లభించే పరిస్థితి వుండదని మేధావులు చెబుతున్నారు.

ఇప్పటికే కనుమరుగు

చిరుధాన్యాల సాగు ఏటా తగ్గిపోతూ కనిపించకుండా పోతోంది. చిరుధాన్యాల్లో ముఖ్యమైన సజ్జ, సామ, కొర్ర, జొన్న, రాగి సాగు లేకుండా పోతోంది. ఇక సజ్జ, సామ, కొర్రలు ఎలా ఉంటాయో కూడా నేటి తరానికి తెలియకపోవడం బాధాకరం. అత్యధిక పోషకాలు కలిగిన ఈ ధాన్యాలు సాగు కనిపించకుండా పోయింది.

చిరుధాన్యాలపై నిర్లక్ష్యం

చిరుధాన్యాల సాగుపై రైతులు నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు. వీటి సాగును పెంచేందుకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకోవాల్సి ఉంది. రైతులు సైతం ఈ ధాన్యాలను పండించక పోవడం బాధాకరం. కేంద్ర ప్రభుత్వం ఇన్సింప్ (ఇంటి గ్రేటెడ్ న్యూట్రిన్స్ సప్లిమెంట్ త్రో ఇన్‌టెంసివ్ మిల్లెట్ ప్రమోషన్) అనే కార్యక్రమం ద్వారా చిరుధాన్యాల సాగును పెంచేందుకు కృషి చేయాల్సి ఉంది. మరోవైపు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా వీటి సాగును చేపట్టేందుకు ప్రయత్నాలు అంతంతమాత్రమంగానే ఉన్నాయి. ఇప్పటికైనా చిరుధాన్యాల విత్తనాలను సబ్సిడీ ద్వారా రైతులకు అందించి పలమనేరు మండలంలో చిరు ధాన్యాల సాగు చేపట్టేందుకు స్థానిక వ్యవసాయశాఖ కృషి చేయాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో చిరుధాన్యాల సాగు వివరాలు

పంట	సాధారణ సాగు (ఎకరాల్లో)	ప్రస్తుత సాగు
జొన్న	86	0
కందులు	3261	51
మినుములు	122	10
అలసంద	540	44
సజ్జ	566	32
రాగి	3101	58
కొర్ర	42	0
సామ	208	0
ఉలవ	2964	0
నువ్వులు	4	0
పొద్దుతిరుగుడు	1	0
ఆముదం	20	0

చూద్దామన్నా కంటికి కనిపించవే...



గతంలో పొలాల్లో వేరుశనగతోపాటు సాలు పంటలు వేస్తా ఉంటిమి. వేరుశనగ ఒబ్బిడయ్యాక ఉలవలు వేసేవాళ్లం. ఈ దఫా వేరుశనగ పంటే లేకుండా పోయె. చిరుధాన్యాల పంటలు గతంలో వేసేవాళ్లం. ఇప్పుడు ఎద్దుల మడకలు పోయే, ట్రాక్టర్లు వచ్చాయి. దీంతో మాలాంటి రైతులు కూడా సాలు పంటలు సాలిస్తిమి. ఇప్పుడు చిరుధాన్యాల పంటలు ఎవరూ వేయడం లేదు.
–సోమిరెడ్డి, నడిమిదొడ్డిపల్లి, పలమనేరు మండలం

చిరుధాన్యాల పెంపునకు కృషి చేస్తున్నాం



జిల్లాలో చిరుధాన్యాల సాగు తగ్గుముఖం పడుతున్న మాట వాస్తవం. ఏటా చిరుధాన్యాల సాగు పెంపునకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఉలవ, జొన్నలను సబ్సిడీతోనూ అందిస్తున్నాం. రైతులు కూడా చిరుధాన్యాలు పండించాలి. వీటిల్లో ఉండే ప్రొటీన్స్ మనిషికి ఎంతో మేలు చేస్తాయి. చిరుధాన్యాల సాగు పెంపుపై ప్రత్యేక చొరవచూపుతాం.
–మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి, చిత్తూరు

నోటీస్ బోర్డు

నేటి నుంచి బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ

పుంగనూరు: మండలంలోని ఆరడిగుంట, సింగిరిగుంట, మేలుందొడ్డి, వనమలదిన్నె, మాగాండ్లపల్లె పంచాయతీల్లో సోమవారం నుంచి 14వ తేదీ వరకు బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అమరనాథరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

13న వాహనాల వేలం

పెద్దపంజాణి: కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్న రెండు ద్విచక్ర వాహనాలకు బుధవారం ఉదయం 11.30 గంటలకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ ధనుంజయరెడ్డి తెలిపారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగే వేలంలో పాల్గొనేవారు నిర్ణీత ధరావతు సొమ్ము చెల్లించాలని సూచించారు.

14న మండల సమావేశం

రొంపిచెర్ల: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 14న ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

పుంగనూరు: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో గల శ్రీ దిగ్విజయ సీతారామాంజనేయ స్వామి సహిత రాఘవేంద్రస్వామి ఆలయంలో ఆదివారం రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాఘవేంద్రస్వామి విగ్రహానికి విశేష అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

ఆదివాసీల సాహిత్యం నేటి సమాజానికి తెలియాలి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, స్థానిక గిరిజన నాయకులు

పలమనేరు: ఆదివాసీల సాహిత్యాన్ని సమాజం ముందుకు తీసుకొచ్చేందుకు నేటితరం కవులు, రచయితలు కృషి చేయాలని ప్రముఖ రచయిత పలమనేరు బాలాజీ సూచించారు. స్థానిక గిరిజన నాయకులు ఆదివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని దుర్గామాత ఆలయం వద్ద పలు కార్యక్రమాలు నిర్వహించారు. జానపద సాహిత్యంలో ఎరుకుల సంస్కృతి- భాషా సాహిత్యాలు అనే అంశంపై ద్రవిడ విశ్వవిద్యాలయంలో పరిశోధనలు చేసిన మునెయ్య అనే విద్యార్థిని సత్కరించి, ఆయన రాసిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గిరిజనుల సంప్రదాయాలపై పరిశోధనలు మరింతగా సాగాలన్నారు. నాటి వీరి సంస్కృతి మరుగున పడిపోకుండా రేపటి సమాజానికి చెప్పాల్సిన అవసరం నేటి రచయితలు బాధ్యతగా భావించాలన్నారు. ఇందులో గిరిజన నాయకులు రమణ, ప్రకాష్, యువరాజ్, అరుణ, తిరుమలరావు, నాగతాజు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి శ్రీకృష్ణాష్టమి వేడుకలు


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సమితి సభ్యులు

వి.కోట: మండలంలోని రామాపురంలో ఈ నెల 16 నుంచి 24వ తేదీ వరకు శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్టు త్రైత సిద్ధాత ప్రబోధ సేవా సమితి సభ్యులు తెలిపారు. వారు ఆదివారం బీజేపీ నాయకుడు రామచంద్రుడుతో కలిసి వేడుకల ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ పిల్లలతో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆఖరి రోజు గ్రామంలో శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగిస్తామన్నారు.

బోయకొండ గంగమ్మ ఆలయంలో శునకాలు హల్‌చల్


గంగమ్మ ఆలయంలో హుండీల వద్ద సంచరిస్తున్న శునకం

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయం గర్భాలయం ముందుభాగంలో శునకాలు ఆదివారం తిష్ట వేసి హల్ చల్ చేశాయి. ఆలయంలో కుక్కలు తిరుగుతున్నా సిబ్బంది పట్టించుకోకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. వాటిని తరిమేందుకు యత్నించిన భక్తులపై కుక్కలు గతంలో దాడి చేశాయి. ఆలయంలో కుక్కలు తిరగడంతో పాటు ఎక్కడపడితే అక్కడ తిష్ట వేస్తుండడంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. ఆలయంలో కుక్కలేంటి ? అంటూ భక్తులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఈవో ఏకాంబరంను వివరణ కోరగా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు.

కూటమి నేతలే డ్రామా ఆడించారు


నాగభూషణరెడ్డి

చౌడేపల్లె: కూటమి నేతలు పథకం ప్రకారం ఆ ముగ్గురితో డ్రామా ఆడించి వైఎస్సార్‌సీపీలోకి చేరేలా చేశారని, గంటల వ్యవధిలోనే మళ్లీ అదే పార్టీలోకి వెళ్లేలా కుట్ర రాజకీయాలు చేశారని పార్టీ మండల అధ్యక్షుడు జి.నాగభూషణరెడ్డి ఆరోపించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని సింగిరిగుంటకు చెందిన ఎం.ప్రకాష్ నాయుడు, పి.చెన్నకృష్ణ, రామయ్యగట్లుకు చెందిన డి.సుజాత వైఎస్సార్‌సీపీలో చేరతామని మూడురోజులుగా తమను సంప్రదించారన్నారు. ఈ క్రమంలో మేరకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని ఆహ్వానించామన్నారు. ఆయన సమక్షంలో పార్టీలో చేరేందుకు సింగిరిగుంటలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ఉండగా అదే గ్రామానికి చెందిన పి.నగేష్, కె.రాజశేఖర్‌నాయుడు, పి.మునిరాజనాయుడు అక్కడికి వచ్చి తాము కూడా వైఎస్సార్‌సీపీలో చేరతామంటేనే కండువా వేసి స్వాగతించినట్లు చెప్పారు. తమను సంప్రదించిన ముగ్గురు మాత్రమే వైఎస్సార్‌సీపీలో నిలిచారని, వారికి మభ్యపెట్టినా తలొగ్గలేదన్నారు. మా పార్టీలోకి రమ్మని ఎవరినో మభ్యపెట్టాల్సిన అవసరం తమకు లేదన్నారు.

జీవోను ఉపసంహరించుకోవాలి


మాట్లాడుతున్న పృథ్వీరాజ్

పలమనేరు: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలోకి విద్యార్థి సంఘాల నాయకుల ప్రవేశాన్ని నిషేధిస్తూ ఇటీవల ప్రభుత్వం జీవో విడుదల చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ స్టూడెంట్ వింగ్ గంగవరం మండల అధ్యక్షుడు పృథ్వీరాజ్ తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సంఘం సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లోకి ఎస్ఎంసీలు తప్ప ఇంకెవరూ వెళ్లరాదని ఆదేశించడం సబబు కాదన్నారు. అక్కడ ఎలాంటి ప్రదర్శనలు నిర్వహించరాదని, ఈ నెల 1న ఆర్‌సీ నెం:30/67/20025తో ఎంఈవో కార్యాలయాలకు ఆదేశాలు పంపించిందని తెలిపారు. ఈ జీవోను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

బైరెడ్డిపల్లె: శంకర నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బైరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 76 మందికి కంటి పరీక్షలు చేసి 40 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వారికి చెన్నై శంకర నేత్రాలయలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మురళీ, క్రిష్ణ, శ్రీనివాసులు, రమణ, గంగాధరం, మహతీ ఫౌండేషన్ అధ్యక్షులు నాగరాజు, నిర్వాహకులు చిన్నబ్బ, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పాలక మండలికి దరఖాస్తులు

పలమనేరు: పట్టణంలోని శివాలయ ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఈవో కమలాకర్ తెలిపారు. హిందువులై ఉండి భక్తులకు సేవ చేయాలనే తలంపు వున్న వారు సోమవారం నుంచి 20 రోజుల్లోపు జిల్లా ఎండోమెంట్ కమిషనర్ కార్యాలయానికి దరఖాస్తులు పంపించాలని సూచించారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని ప్యాలెస్ ఆవరణలో వున్న పురాతన శ్రీ వరదరాజస్వామి ఆలయ ధర్మకర్తల మండలికి దరఖాస్తు చేసుకోవాలని ఈవో ఏకాంబరం తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 27వ తేదీ లోపు దరఖాస్తులను చిత్తూరు నగరం చర్చివీధిలో వున్న దేవాదాయశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పందెంకోడి రూ.10 వేలు


రూ.10వేలు పలికిన కోడి పుంజు

పలమనేరు: పలమనేరు ప్రాంతంలోని గ్రామాల్లో రైతులు పెంచుకుంటున్న నాటు పందెం కోళ్ల ధరలు భారీగా పెరిగాయి. ఒక్కొక్కటి రూ.5 వేల నుంచి రూ.10 వేలు పలుకుతున్నాయి. ఫామ్స్‌లో సాకే కోడి పుంజులు అంత బలిష్టంగా వుండవు. వాటిలో పోటీని తట్టుకునే సామర్థ్యం తక్కువగా వుంటుంది. నాటు కోడి పుంజులు బలిష్టంగా ఉంటాయి. ఈ ప్రాంతంలోని పలు గ్రామాల్లో రైతులు ఇళ్ల వద్ద నాటు కోళ్ల పెంపకాన్ని చేపడుతున్నారు. పొరుగు రాష్ట్రాలకు చెందిన కోడి పందెం రాయుళ్లు ఇక్కడికి వచ్చి నాటు కోడి పుంజులను కొనుగోలు చేస్తున్నారు. పలమనేరు సమీపంలో ఒక యువకుడు పెంచిన బెనుసు కోడి పుంజు ధర రూ.10 వేలు పలికింది. ఇటీవల నాటు కోడిపుంజులకు మంచి డిమాండ్ రావడంతో రైతులు సైతం వీటిని పెంచేందుకు ఆసక్తిని చూపుతున్నారు.

కాడెద్దులు కనుమరుగాయెరా..!



"ఇల్లు కట్టుకునె ఇటుకల రాయితో.. సెలకల జల్లె ఎరువుకుళ్లతో.. ఎడ్ల బండి ఉన్నోడికి సేతిలో ఏడాదంతా పని దొరికేది.. టాటా ట్రాక్టర్ టక్కరిచ్చినాదో.. నా డొంక దారిని.. నా ఎడ్లబండి ఇల్లెగిరి పద్దదో నా పల్లెల్లోనా.." అని కొన్నేళ్ల కిందట విప్లవ గేయ రచయిత గోరేటి వెంకన్న ఎడ్ల బండి..కాడెద్దుల గొప్పతనం గురించి పాట రాశారు. సాంకేతికత పెరిగిన నేపథ్యంలో రైతులు యాంత్రీకరణ వైపు మళ్లారు. దీంతో పల్లెల్లో కాడెద్దులు కరువయ్యాయి. అవసరం వచ్చినప్పుడు మాత్రం మనుషులే కాడెద్దుల్లా మారిపోతున్నారనడానికి ఇక్కడ కనిపించే ఫొటోనే సాక్ష్యం. చౌడేపల్లె మండలం వెంగళపల్లె పంచాయతీ మల్లువారిపల్లె సమీపంలో ఆదివారం రైతులు వెంకటరమణ, కృష్ణప్ప నాగలితో బురదమడిని చదును చేస్తూ కనిపించారు. - చౌడేపల్లె



అపూర్వ సమ్మేళనం

బైరెడ్డిపల్లె: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2000–2001లో పదో తరగతి చదివిన వారు ఆదివారం బైరెడ్డిపల్లెలో రాయల్‌మహల్ కల్యాణ మండపంలో సమావేశమయ్యారు. చిన్ననాటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకున్నారు. స్నేహితులతో సరదాగా గడిపారు. తమ అభ్యున్నతికి బాటలు వేసిన గురువులు రామానాయుడు, సుబ్రమణ్యం రెడ్డి, సుభాషిణి, నరేంద్రబాబు, గోవిందరాజులు, బాలసుబ్రమణ్యం, అంజమ్మ, అపరంజిత, కుమారస్వామి, చంద్రశేఖర్‌గుప్తాను ఘనంగా సత్కరించారు.

నేటి నుంచి గుడివంక బ్రహ్మోత్సవాలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పెద్ద సంఖ్యలో తరలిరానున్న భక్తులు

గుడుపల్లె: ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలోని పశ్చిమ వాహిని సమీపంలోని వేపమాను కొండపై వెలసిన వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి భక్తుల పాలిట కొంగు బంగారంగా విలసిల్లుతున్నారు. ఇక్కడి పశ్చిమ వాహినిలో స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ఈ క్రమంలో ప్రతి ఏటా ఆడిమాసంలో గుడింవంకలో స్వామి వారికి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ మాసంలోని వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు, ఆలయ పాలక మండలి సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రాష్ట్రాలకు చెందిన భక్తులు వివిధ కావళ్లు ఎత్తుకుని వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ పాలక మండలి సభ్యులు, అదికారులు తెలిపారు. మంగళవారం అభిషేకం, గంగ పూజ, 12న రుద్రాభిషేకం, 13న కల్యాణోత్సవం, 14న రథోత్సవం, బాణు వేడుకలు, 15న వసంతోత్సవం, ఊంజల్ సేవ, భజనలు, కీర్తనలు, 16న ఆడికృత్తిక కావళ్ల చెల్లింపు, 17న అభిషేకం, మహామంగళ హారతి కార్యక్రమం ఉంటాయని పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజూ అన్నదానం చేస్తామని వెల్లడించారు.


ఆలయం వద్ద ప్రవహిస్తున్న పశ్చిమ వాహిని


వేపమాను కొండపై వెలసిన గుడివంక ఆలయం


గుడివంక శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి